ప్రజాశక్తి
శుక్రవారం 4 అక్టోబర్ 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



స్కానింగ్ సెంటర్లలో తనిఖీ

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం ప్రియంవద పట్టణంలోని డాక్టర్ కోటిరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ , సంకల్ప హాస్పిటల్ , అజ్మల్ నర్సింగ్ హోమ్, ప్రగతి డాక్టర్ దన్యాసి మాలకొండయ్య హాస్పిటల్ , ప్రశాంతి నర్సింగ్ హెూమ్ స్కానింగ్ సెంటర్ లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రియంవద మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు.మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ షేక్ ఆరిఫుల్లా పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న దృశ్యం

విజన్ ఘనం..ఆచరణ అనుమానం..!

2014లోనూ ఇదే తరహా హడావుడి - ప్రాధాన్యత రంగాలపై దృష్టిపెట్టేనా..

రాష్ట్ర ప్రభుత్వం 2047 విజన్‌పై దృష్టిపెట్టింది. జిల్లాలోని ప్రాధాన్యత రంగాల్లో మంచి వృద్ధి రేటు సాధించాలంటే ఏం చేయాలనే విషయంపై ప్రజల నుంచే సమాచారం తీసుకుంది. ఇప్పటి వరకు 50 వేల మంది తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఒకప్పుడు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అనేక వనరులుండేవి. విభజన తరువాత జిల్లాలో ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులు లేవు. వ్యవసాయం, విద్యా, వైద్య రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించినప్పుడే ప్రజల్లో మార్పు వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. స్వర్ణాంధ్ర 20 47 విజన్ డాక్యు మెంటరీని ప్రజా ప్రతినిధులు,ప్రజలు సహకారంతో తయారుచేయడానికి చర్యలు తీసుకునేందుకు బుధవారం కస్తూర్బా కళాక్షేత్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులకు విజన్ పెద్దగా పట్టలేదు. కొందరు వ్యక్తులు, అధికారులు మాత్రమే తమ అభిప్రాయాలు తెలిపారు. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం విజన్ 2020 పేరుతో ఇదే తరహా హడావుడి చేసింది. ఫలితాలు మాత్రం పెద్దగా కనిపించలేదు. నేటి విజన్ ఘనంగా ఉన్నప్పటికీ ఆచరణపైనే అనుమానాలున్నాయి..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నూతన రాష్ట్రం, జిల్లా అభివృద్ధిలో ముందడుగు వేసింది. ప్రజలకు ఏం కావాలి.. ప్రభుత్వం ఏం చేయాలి..ఏ రంగంలో ఎలాంటి అభివృద్ధిని కోరుకుంటున్నారు..ప్రజల జీవన ప్రమాణాలు, నిరుద్యోగ యువతికి ఉద్యోగాలు, విద్యార్థులకు మంచి విద్య, వైద్య రంగంలో మార్పులు. ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి 2047 సంవత్సరం 100 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో ప్రగతిని చూపించాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం పెట్టింది. అందులో భాగంగా అధికారులు ప్రజల నుంచి విజ్ఞప్తులు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాపితంగా 50 వేల మంది ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వార వివరాలు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు రెండు రోజులు కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి విజన్‌కు సంబందించిన లక్ష్యాలు తెలిపారు. జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు కూర్చొని జిల్లాలో ఏయే రంగాల్లో అభివృద్ధి సాధించాలనే విషయంపై సమగ్ర నివేదక తయారుచేయాల్సి ఉంది. ఒకరిద్దరు ప్రజా ప్రతినిధులకు తప్ప పెద్దగా విజన్ ప్రజా ప్రతినిధులకు ఎక్కలేదు. కొందరు వ్యక్తులు, అధికారులు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం పోర్టు ప్రధాన ప్రాజెక్టులుగా ఉన్నాయి. కృష్ణపట్నం పోర్టులో గతంలో ఉన్న అభివృద్ధి పెద్దగా కనిపించడం లేదు. వేలాది మంది ఉపాధి, ఉద్యోగం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు సమస్యలతో కొట్టుమిట్టా డుతోంది. దీనిపై ప్రభుత్వానికి ఉన్న విజన్ ఏమిటో అర్థం కావడం లేదు. ఈ ప్రాజెక్టు పరిధిలో ధర్మల్ ప్రాజెక్టులు, ఆయిల్ పరిశ్రమలు, ఉన్నాయి. భూములు పెద్ద ఎత్తున ప్రభుత్వం అప్పగించింది. ఇక్కడ సమగ్ర పారిశ్రామిక అభివృద్ధి జరిగితే జిల్లా రూపు రేఖలే మారిపోతాయి. వ్యవసాయం రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రజలు వరిసాగుకు వెనుకాడుతున్నారు. ఆక్వా రంగ అధోగతి పట్టింది. ఒకప్పుడు 2.5 లక్షల ఎకరాల్లో సాగిచేసిన ఆక్వా ఇప్పుడు 25వేల ఎకరాల్లో కూడా సాగు కావడం లేదు. ఎగుమతులు తగ్గిపోయాయి. అక్వా రంగంలో సంక్షోభం ఉంది. సీడ్స్, ఫీడ్స్, ధరల విషయంలో ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారు, సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నిర్వహణ సరిగా లేదు. కిసాన్ సెజ్ పేరుతో 30 సంవత్సరాల క్రితం రైతుల భూములు తీసుకున్నారు. ఇప్పటికీ ఇక్కడ ఒక్క భారీ పరిశ్రమ రాలేదు. విద్యుత్ రెక్కల తయారీ కోసం గమేశా ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఇప్పుడు అది పనిచేయడం లేదు. వందలాది ఎకరాల భూమి ఖాళీగా ఉంది. ఒక్క భారీ పరిశ్రమ ఇక్కడ రాలేదు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు జిల్లాలో ఎక్కడా లేవు. విద్యా, వైద్య రంగంలోనూ అనేక సమస్యలున్నాయి. ప్రజల సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఆక్వా చెరువు..

2014లోనూ ఇదే తరహా విజన్..!

రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2020 పేరుతో గతంలోనూ అనేక కార్యక్రమాలు నిర్వహించింది. ప్రగతి మాత్రం ముందుకు సాగలేదు. 2014 అప్పటి చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కలెక్టర్లతో ఇదే తరహా సమావేశం ఏర్పాటు చేశారు. అప్పటి కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ ఈ సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయం, ఆక్వా, పరిశ్రమలు, నీటిప్రాజెక్టులు, విద్యా, వైద్య రంగంలో ఏం చర్యలు తీసుకోవాలనే విషయాలపై అప్పట్లోనే చర్చ సాగింది. ఒక్క అడుగు ముందుకుపడలేదు. పరిశ్రమలు వచ్చినట్టే వచ్చి అన్ని వెళ్లిపోయాయి. ధర్మల్ ప్రాజెక్టులు, సెజ్‌ల పేరుతో భారీగా భూములు తీసుకొని అడ్రస్ లేకుండా వెళ్లిపోయారు. కొందరు ఆ భూములు తాకట్టుపెట్టి బ్యాంకు రుణాలు తీసుకున్నారు. పరిశ్రమ కోసం భూములిచ్చిన నిర్వాసితులు ఇప్పటికీ ఆవేదన చెందుతున్నారు. తమ పిల్లలకు ఉద్యోగాలు, ఉపాధి దొరకలేదు. ప్రభుత్వం తయారు చేస్తున్న విజన్ జిల్లాలోని ప్రజలు మౌలిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాల్లో మార్పు వచ్చినప్పుడే విజన్ లక్ష్యం నెరవేరుతోంది. ప్రభుత్వం 2047 లక్ష్యంగా పెట్టుకున్నా ప్రస్తుతం 2024-29 ఐదేళ్ల ప్రగతి విషయంలో నివేదిక తయారుచేస్తుంది. లక్ష్యం ఘనంగా ఉన్నప్పటికీ , ఆచరణ విషయంలోనే అనుమనాలున్నాయి. ప్రజలు భవిష్యత్తు మారే విజన్ రావాలని కోరుకుంటున్నారు..

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

నెల్లూరు : దసరా సెలవుల్లో కళాశాలలు నడవకుండా సెలవులు పక్కగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ సభ్యురాలు బత్తుల పద్మావతి ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు. గురువారం ఇంటర్మీడియట్ బోర్డు నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఒ) ఆదురు శ్రీనివాసులతో కలిసి నెల్లూరు నగరంలోని చైతన్య , విశ్వసాయి జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు ఉన్నారు.

11న మద్యం షాపులకు లాటరీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :నూతన మద్యం షాపుల కోసం ఈ నెల 11న లాటరీ నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ జీవి ప్రసాద్ రెడ్డి తెలి పా రు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు మండలాలకు సంబంధించి మొత్తం 18 మద్యం దుకాణాలు మంజూరయ్యా యన్నారు. ఈ మేరకు ఇందుకూరు పేట మండలానికి 5 షాపులు, తోటపల్లి గూడూ రు మం డలానికి మరో 5 షాపులు, ముత్తుకూరు మండలానికి 8 షాపుల వంతున ఏర్పాటు చేస్తు న్నట్టు ఆయన చెప్పారు.

జివి ప్రసాద్‌రెడ్డి
ఎక్సైజ్ సిఐ

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

నేడు కలెక్టరేట ఎదుట ధర్నా సిపిఎం ధర్నా

ప్రజాశక్తి -నెల్లూరు

తక్షణమే ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. గురువా రం బాలాజీ నగర్ లోని సి పి ఎం జిల్లా కార్యాలయం లో ఆ కమిటీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఇసుకను ప్రజలకు తక్షణమే అందుబాటులోకి తీసుకొచ్చి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తవుతున్నా ఇసుక అందుబాటు లోకి రాలేదన్నారు. ఉచిత ఇసుక విధానం పేరుతో ప్రచార ఆర్భాటాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయని, ఇసుక మాత్రం బ్లాక్ మార్కెట్లో భారీగా ధరలు పలుకు తుందన్నారు. నగరంలో ఒక ట్రాక్టర్ ధర రూ. 5 వేలు నుంచి రూ. 9 వేలు, టిప్పర్ ధరరూ. 25 వేలు నుంచి రూ. 60 వేలు పలుకు తుందన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ పేరుతో ప్రభుత్వం ప్రజల కు ఇసుక దొరకకుండా చేసిందన్నారు. నగర కార్యదర్శి వర్గ సభ్యు లు జి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇసుక కొరత వల్ల నిర్మాణ రంగ కార్మికులు వేల మంది పస్తులు ఉంటున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కార్మికుల ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నగర కమిటీ సభ్యులు ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో 40 రకాల పనులు చేసే కార్మికులు లక్షలాదిమంది జిల్లాలో ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. పరోక్షంగా సిమెంటు, స్టీలు,పెయింట్, వుడ్ , ఎలక్ట్రిక్ వస్తువులు ఇలా అనేక రకాల సంబంధిత వ్యాపారాలు సంక్షోభంలోకి నెట్టబడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలన్నారు. సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి. సూర్య నారాయణ, నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహా, చిరంజీవి, అత్తిమూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజల సహకారంతో

2047 విజన్ డాక్యుమెంటరీ రూపకల్పన : కలెక్టర్

ప్రజాశక్తి -నెల్లూరు :జిల్లాలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యు మెంటరీని ప్రజా ప్రతినిధులు,ప్రజలు సహకారంతో రూపకల్పన చేస్తామని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రంలో స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంటరీ పై అధికారులు, ప్రజాప్రతిధులతో వర్క్ షాప్ ను నిర్వహించారు. రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీ తయారు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం వీలవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి పారిశ్రామికవేత్త ముందుకు వస్తున్నారన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ భారతదేశం సమగ్ర అభివద్ధి సాధించి 2047 నాటికి ప్రపంచ మూడు అగ్రగామి ఆర్థిక శక్తులలో ఒకటిగా నిలవాలని ఆమె తెలిపారు. ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ విజన్ ప్రణాళిక ద్వారా 2047 నాటికి ఉదయగిరి నియోజక వర్గ రూపు రేఖలలో మార్పు తీసుకు వస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు మాట్లాడు తూ జిల్లాలో నాణ్య మైన విద్యను అందించడానికి ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధనకు అవసరమైన ప్రణాళికలను తయారుచేయడానికి చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డిమాట్లాడారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ చైర్ పర్సన్ పొట్లూరి స్రవంతి, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి -నెల్లూరు :ఓటరు జాబితా గందరగోళంగా ఉందని టిడిపి అధికా ర ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ పేర్కొన్నారు. గురు వారం ఓటరు జాబితాలు రేషనలైజేషన్ ప్రక్రియ గురించి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజకీయ పార్టీ ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. టిడిపి అధికార (ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇబ్బందుల దృష్ట్యా ఏ పోలింగ్ స్టేషన్ జాబితాలోకి ఏఏ డోర్ నెంబర్ వస్తాయో స్పష్టంగా తెలి యజేసే జాబితా తయారు చేయాలని గత కమిషనర్‌ను కోరామన్నారు. ఎన్నికల సమయం కావున ఆ ప్రక్రియ అమలు చేయడానికి వీలుపడలేదన్నారు. వాటిని వెంటనే ఇంప్లిమెంట్ చేసి ఓటర్ల నమోదు ప్రక్రియ స్పష్టంగా వచ్చేలా చేయాలని కమిషనర్ ను కోరారు. తహాశీల్దార్ షఫీ మాలిక్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

ఓటరు జాబితాపై చర్చిస్తున్న రాజకీయ పార్టీల నాయకులు

సుస్థిర అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :పంచాయతీని అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధిం చడమే లక్ష్యమని సర్పంచ్ కదురు వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం పాపిరెడ్డిపాలెం సచివాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలని, అనంతరం పంచాయతీ అభివృద్ధే ప్రధాన అజెండా అన్నారు. ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో పంచాయతీ లో మౌళిక వసతులు కల్పించడంతో పాటు అభివద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గత 30 ఏ ళ్లగా తాగునీటి వసతికి నోచుకోని గిరిజన కాలనిలో తా గునీటి సౌకర్యం కల్పిం చడం జరిగిందని సర్పంచ్ తె లి పారు. ఉప సర్పంచ్ మేనాటి శీనయ్య, కడివేటి సుధాకర్ రెడ్డి, తిరవళ్ళూరు రామసు బ్బయ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, విఆర్వో సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో మోస్తరు వర్షం

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు డివిజన్లో 80. 6 మిల్లీమీటర్ల వర్షపాతం గురువారం నమోదైంది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు కందుకూరి ప్రాంతంలో వర్షం కురిసింది. కందుకూరు మండలంలో 13.0 వలేటివారిపాలెం మండలంలో 6.8 మి.మి వర్షపాతం నమోదైంది. మండలంలో 15.8 మి.మి. గుడ్లూరులో 7.2 మి.మి. ఉలవపాడు మండలంలో 4.6 మి.మి. కొండాపురం మండలంలో అత్యధికంగా 33.2 మి.మి వర్షం కురిసింది.

పనులు గుర్తించండి..

ప్రజాశక్తి - లింగసముద్రం : ప్రజలకు అవసరమైన పనులు, రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పనులను గుర్తించాలని మండల పరిషత్ అభివద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు చెప్పారు. గురువారం మండలంలోని అన్నేబోయినపల్లి, అంగిరేకులపాడు గ్రామాల్లో 2024 - 25 పనులు గుర్తింపు కోసం గ్రామసభ నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో పనులను గుర్తించి వాటిని పూర్తిచేయాలని చెప్పారు. అన్నే బోయినపల్లి సర్పంచ్ ఏందోటి లక్ష్మీ ప్రసన్న, పంచాయితీ కార్యదర్శిలు షేక్ గౌస్టె,క్లినికల్ అసిస్టెంట్ రాఘవ నాయకులు పాల్గోన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులను నివారించాలి

నేటి నుంచి రిలే దీక్షలు

ప్రజాశక్తి -నెల్లూరు

ఆశా వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేటి నుంచి నుండి కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు నిర్వహిస్తామని ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ పేర్కొంది.ఆ యూనియన్ ఆధ్వర్యంలో జేమ్స్ గార్డెన్ లోని, శ్రీహరి భవన్‌లో విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, అధ్యక్షురాలు, కె విజయలక్ష్మి మాట్లాడుతూ గత 18 ఏళ్ల నుంచి ఎటువంటి ఆరోపణలు లేకుండా విధులు నిర్వహిస్తున్న కలిగిరి మండలం రావులకొల్లు ఆశా వర్కర్ ని అక్రమంగా విధులు నుంచి తొలగించడం దారుణమన్నారు.కలెక్టర్, డిఎంహెచ్ఒ, ఎంఎల్ఎలను కలిసి వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదన్నారు. స్థానిక సర్పంచి మాటలు విని ఆమెను తొలగించారన్నారు. ఇప్పటికైనా టిడిపి ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్ కి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కే పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దుగ్గిరాల అన్నపూర్ణమ్మ

స్మార్ట్ రిటైల్ షాపు సందర్శన

ప్రజాశక్తి - ఉలవపాడు

మండలంలోని కరేడు పాతాళం వెంకటసుబ్బయ్య శ్రేష్ఠ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒకేషనల్ ఇంటర్న్‌షిప్ ఇంటర్నె షిప్ నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పన్నూరు. శ్రీనివాసులు తెలిపారు. గురువారం పిఎం శ్రీ స్కూల్స్‌లో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సులో పని అనుభవంలో భాగంగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు రిటైల్ విభాగంలో ట్రైనర్ తడవర్తి ధనలక్ష్మి, శింగరాయకొండ లోని స్మార్ట్ రిటైల్ స్టోర్స్ ను విద్యార్థులకు ను సందర్శింపజేసి రిటైల్ రంగానికి సంబంధించిన అంశాలపై ,హెల్త్ కేర్ విభాగంలో ట్రైనర్ కుంచాల శైలజ కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శింపజేసి రక్తపరీక్షలు, ఓ.పి విభాగం, వైద్య సేవలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఒకేషనల్ ట్రైనర్లు ఉపాధ్యాయులు కె .కష్ణ, పాఠశాల విద్యార్థులకు ఇంటర్ షిప్ నిర్వహించడం పట్ల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోటం. బాలేశ్వరరావు అభినందించారు.

స్మార్ట్ రిటైల్ షాపును సందర్శించిన విద్యార్థులు

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'..!

కందుకూరులో..

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని కొండముడుసు పాలెం, కంచర గుంట గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వి రాము మాట్లా డుతూ వ్యవసాయశాఖ , అనుబంధ సాఖలన్నింటిని ఒకే చోటికి తీసుకొచ్చి వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చే దుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం అని తెలిపారు. ప్రకతి వ్యవసాయ అధికారి డి ధనమ్మ మాట్లా డారు. ముఖ్య అతిథిగా కందుకూరు మండల పరిషత్ అధ్యక్షులు ఇంటూరి సుశీల,వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి షేక్.ఖాసిం, ప్రకతి వ్యవసాయ అధికారి డిఏంఏం , సిహెచ్. వెంకట్ రాజా, కొంముడుసు పాలెం, కంచరగుంట గ్రామాల ,గ్రామ వ్యవసాయ సహాయ కులు ఎల్. రమా దేవి, పీ . శరత్ కుమార్ ఉన్నారు.

ప్రజాశక్తి -తోటపల్లి గూడూరు :సేంద్రీయ ఎరువులతో నేల సారవం తమవుతుందని, తద్వారా వ్యవ సాయ లాభసాటిగా మారుతుందని వ్య వసాయ అధికారి వి వి శిరీష రాణి పేర్కొన్నారు. గురువారం తోటపల్లిగూడూరు మండలం పొట్లపూడి, వెంకన్నపాలెం సచివాల యాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవ డానికి రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వాడి, నేలను సారవంతం చేసుకోవాలని తెలిపారు. సర్పంచ్ చిల్లకూరు ప్రసూన, ప్రజా ప్రతినిధులు, గ్రామ వ్యవసాయ సహా య కులు అనూష, ఆర్. డయాన,ఉన్నారు.

తోటపల్లి గూడూరులో..

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరు నుంచి కొండముడుసుపాలెం వెళ్లేదారిలో ఉన్న బైపాస్ వద్ద ఫ్లైఓవర్ లేదా అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ మాట్లాడుతూ కందుకూరు నుండి కొండ ముడుసు పాలెం, మోపాడు గుడ్లూరు ఎక్కువగా ట్రాఫిక్ ఉంటుందన్నారు. కొండముసి పాలెం గ్రామస్తులు పిల్లలు చదువులు కోసం, నిత్యావసరాల కోసం రోజువారి కూలి పనుల కోసం కందుకూరు వస్తారన్నారు. కందుకూరు నుండి కావలి ఆర్‌టిసి బస్సులు అరగంటకు ఒకటి తిరుగుతుంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఫైవర్ లేదా అండ్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరముందన్నారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూస్తామన్నారు. సిపిఎం పట్టణ నాయకులు డి రామ్మూర్తి గారు ఎస్ కే మున్వర్ సుల్తానా టి వెంకట్రావు ఎస్ కే మల్లికా ఎం పద్మ ఎం రవి డి ఎం రాయుడు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఏజెంట్లు

ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

ప్రజాశక్తి-కందుకూరు

స్థానిక జీవిత బీమా కార్యాలయం వద్ద ఎల్ఐసి ఎఓఐ(సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం నిరసన జరిగింది. ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిన కొత్త మార్పులను ఏజెంట్లు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఈ కొత్త విధానంలో తెచ్చిన పాలసీలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని యూనియన్ ప్రెసిడెంట్ బెజవాడ శివయ్య తెలిపారు. కొత్త విధానంలో తెచ్చిన పాలసీలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. యూనియన్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, ప్రభాకర్, సింగయ్య ,శేఖర్ రెడ్డి, మాల్యాద్రి ,మాధవరావు ,గుమ్మ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వైభవంగా అభిషేకం

ప్రజాశక్తి -కందుకూరు : అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు అంకమ్మ తల్లి అమ్మవారికి ఉదయం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా అభి షేకం నిర్వహించారు.ఉభయ దాతలుగా కొనిజేటి రవికుమార్ అనిల్ కుమార్ బ్రదర్స్, ఇస్కాల మురళీకష్ణ,చక్కా బ్రహ్మయ్య, వందవాసి సుబ్బారావు, కొనిజేటి శ్రీనివాసులు వ్యవహరించి శ్రీ విఘ్నేశ్వరునికి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తొలుత ఆలయాన్ని పూలతో మామిడాకులతో అలంకరించారు. ఆలయ ఇఒ కష్ణవేణి, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం పల్లకి సేవ వైభవంగా జరిగింది. పల్లకి సేవలో ఉభయ దాతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని అంగిరేకులపాడు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల పరిషత్ అభివద్ధి అధికారి కట్టా శ్రీనివాసులు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన రికార్డును పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వస్తున్న పౌష్టికాహారం అందరికీ అందించాలని, మెనూ ప్రకా రం పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలని సూచించారు. బాలిం తులు, గర్భిణులకు పోషకామారం అందించాలన్నారు..

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మద్యం విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-కావలి: ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్యం దుకాణాలకు బదులు ప్రయివేట్ సిండికేట్లకు అమ్ముకునే విధానాన్ని ప్రవేశపెట్టడం, మద్యనిషేధం కోరిన గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి అక్టోబర్ 2వ తేదీనే ప్రకటించడం అత్యంత గర్హనీయమని. మహిళా సామాజికవేత్త చాకలకొండ శారద ఒక ప్రకటనలో ఖండించారు."మేము ఎక్కడంటే అక్కడ ఎవరంటే వారికి మద్యం షాపులు పెట్టుకునే అనుమతులిస్తాం, మీరే మీ భర్తలను మద్యం తాగకుండా మార్చుకోండి ." అని కుహనా ప్రకటనలు చేసి, ముఖ్యమంత్రి మహిళలకు వ్యతిరేకం అయ్యారు. విద్యాలయాలు ,దేవాలయాలు,చర్చి,మసీదులకు దగ్గర్లో మద్యం దుకాణాలు తమ ఇష్టారాజ్యంగా పెడితే మగవాళ్ళు, యువకులు, విద్యార్థులు ఆ ప్రాంతంలో నడిచి తాగుబోతులవడానికి అవకాశం కల్పించినట్లే నన్నారు.అధికారంలోకి వచ్చాక " దశలవారీ మద్య నిషేధం చేస్తాం ." అని ప్రకటించిన గత ప్రభుత్వం ఆచరణలో విఫలమైతే .,ఇప్పటి ప్రభుత్వం మహిళలకు తీవ్ర నష్టం కలిగించేలా మద్యం అమ్మకాలను ప్రైవేట్ పరం చేసిందన్నారు. అధికంగా పెరిగిన నిత్యావసరాల ధరలు , విద్యుత్ ధరలు సామాన్యుల నెత్తిపై భారమై నడ్డి విరుస్తుంటే , ఇప్పుడు వాటి ధరలు తగ్గించాల్సింది పోయి, రూ.99లకే ధర నిర్ణయించి ప్రభుత్వం తాగుబోతులను పెంచేవిధానం తేవడం కుటుంబాలకు తీవ్ర ఆవేదనను కల్గిస్తుందన్నారు.గంజాయి నల్లమందులను అదుపుచేయలేని అసమర్థత పెద్దఎత్తున కనబడుతుంటే , యువత పెడదారి పట్టి వ్యసనపరులపై ఒంటిని ఇంటిని గుల్లచేయడంతోబాటు , కన్నుమిన్ను కానక బాలికల నుండి ముసలి మహిళల మాన ప్రాణాలను మరింత పెరిగేందుకు ప్రయివేటు మద్యం వ్యాపారాలకు అనుమతి ఇచ్చిందన్నారు.కొత్త మద్యం విధానాన్ని ఏపీ ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ధ్వంసం చేసిన వారిపై చర్యలు

ప్రజాశక్తి-కావలి: తీర ప్రాంత గ్రామాలలో రోడ్లు ధ్వంసం చేసిన గ్యాస్ పైప్‌లైన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి ఆధ్వర్యంలో ఆర్‌డిఒకు వినతిపత్రం అంద జేశారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ కృష్ణపట్నం నుంచి విశాఖ పట్టణం వరకు వందల కోట్ల రూపాయల విలువలతో గ్యాస్ లైన్ పైప్ వేస్తున్నారని తెలిపారు. 5 అడుగుల లోతు తీయడం వలన కృష్ణపట్నం నుంచి విశాఖకు పోయే రోడ్లను, సిసి రోడ్లను ధ్వంసం చేశారని

నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

తెలిపారు. టిడిపి పరిపాలన సమయంలో తీర ప్రాంత గ్రామాలలో రోడ్లు అన్ని వేశారని అవి అన్నియు ధ్వంసం చేశారని తెలిపారు. ధ్వంసం చేసిన రోడ్లపై మట్టి చల్లి వెళ్ళిపోతున్నారని తెలిపారు. వరదలువచ్చే వర్షాకాలంలో వరద నీరు వచ్చే ముప్పు ఉందని తెలిపారు. రెవెన్యూ అధికారులు కాంట్రా క్టర్లపై చర్యలు తీసుకోవాలని యథా ప్రకారం రోడ్లు ఉండాలని, ధ్వంసమైన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేయాలని తెలిపారు. పై అధికారులకు ఆర్‌డిఒ తెలియచేస్తారని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో అంజిపాకరత్నం, చెరుకూరి జనార్దన్, జ్యోతి జాన్, పి.శ్రీనివాసులు, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి

ప్రజాశక్తి-మర్రిపాడు: స్థానిక సిపిఎం కార్యాలయంలో ఐద్వా మహిళా సంఘం నాయకురాలు శ్యామలమ్మ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో మహిళలు స్వతంత్రంగా తిరగాలని తన హక్కులు తను సాధించు కోవాలన్నారు. మానభంగాలు, హత్యలు, దౌర్జన్యాలను ప్రభుత్వాలు అరికట్టకుండ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో మహిళలు ఏకమై మద్యంపై పోరాటం మొదలు పెట్టాలని

గాంధీజికి నివాళులర్పిస్తున్న ఐద్వా

గ్రామాల్లో బెల్టు షాపులకు ఆస్కారం లేకుండా అడ్డుకునేందుకు మహిళలు నడుం బిగించా లన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు ప్రమీల, ఖాసింబీ, హిమలమ్మ, రత్నకుమారి, అశాలు కామాక్షమ్మ, భారతి.రత్నయ్య మండల కార్యదర్శి రహంతుల్లా, సుధాకర్, మహ్మద్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలకు తనూజ ఎంపిక

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న బండి రామయ్య కుమార్తె తనూజ కరాటే విభాగంలో రాణించి జాతీయ కరాటీ పోటీ లకు ఎంపికైనది. తనూజ ఆత్మకూరు చైతన్య టెక్నో స్కూల్లో ఏడవ తరగతి చదువుతూ రాష్ట్రస్థాయిలో రాజంపేటలో గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో కరాటే పోటీలు జరిగాయి. సీనియర్లను ఓడించి కరాటే భాగంలో ప్రతిభ కనబరిచి నేషనల్‌కు ఎంపికైంది. తనుజాకు కరాటే మాస్టర్ వి. శ్రీనివాసులు కోచ్ గా వ్యవహరించారు. తనుజాకు ఢిల్లీలో జాతీయస్థాయిలో కరాటే భాగంలో పోటీ పడనున్నది. నేషనల్‌కు తనుజ ఎంపిక కావడంతో తండ్రికి తగ్గ తనయురాలుగా శభాష్ అనిపించుకుంది.

ఎట్టకేలకు ఆ విఆర్‌ఒలు బదిలీ

"ప్రజాశక్తి" వార్త ప్రభావం..!!

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బదిలీ కావాలి. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా దాదాపు 750 విఆర్‌ఒలు బదిలీ కావాల్సి ఉంది. కలెక్టర్ ఆనంద్ రాజకీయ పైరవీలకు, ఒత్తిళ్లకు ఏ మాత్రమూ తలొగ్గకుండా 750 మంది విఆర్వోలను బదిలీ చేశారు.ే కారణా లు ఏమిటో తెలియదు గానీ, ఈ 750 మందిలో తొమ్మి ది మంది విఆర్వోలకు బదిలీ ఉత్తర్వులు అందలేదు. దాంతో "విఆర్‌ఒల బదిలీలకు బ్రేక్..రెవెన్యు శాఖలో మల్లగుల్లాలు" అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 2వ తేదీన వా ర్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన కలెక్టర్ ఆనంద్ ఆ వీఆ ర్వోలకు సంబంధించిన సర్వీస్ రికార్డులను తన కార్యాలయానికి తెప్పించుకొని పరిశీలించారు. ఆ విఆర్ఓలు దొడ్డిదారిన తమ బదిలీలను ఆపుకున్నట్లు కలెక్టర్ విచారణలో వెల్లడైంది.అనంతరం కలెక్టర్ ఆనంద్ ఆ వీఆర్వోలను బదిలీ చేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ విఆర్‌ఒలలో కొందరు 2015, మరి కొం దరు 2019 నుంచి విధుల్లో వున్నారు. ప్రభుత్వం ని ర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈ విఆర్వోలు బదిలీ కావాలి. దొడ్డిదారిన తమ బదిలీలను ఆపుకున్న విషయం కలెక్టర్ విచారణలో వెల్లడైంది. దాంతో కలెక్టరు ఆనంద్ ఈ విఆర్వోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేత్ర దానం

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు నగరానికి చెందిన నెల్లూరు సులోచనమ్మ అనారోగ్య కారణంగా మృతిచెందారు. ఆమె కుమారుడు నెల్లూరు భక్తవత్సల్ రెడ్డి స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆమె నేత్రాలను మరణానంతరం సింహపురి దేహ సమర్పణ సంస్థ ద్వారా నెల్లూరులోని ప్రముఖ నేత్ర వైద్యశాల మోడరన్ ఐ హాస్పిటల్ కు డొనేట్ చేశారు. సులోచనమ్మ నేత్రాలు ఇద్దరి చూపులేని కార్నియా పేషెంట్లకు చూపు కలిగించే అవకాశం ఇచ్చినందుకు, ఆమె కుటుంబ సభ్యుల దాతృత్వానికి సింహపురి దేహ సమర్పరణ సంస్థ కన్వీనర్ పి.విజయ హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమం తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి: మండలంలోని కొండ కింద పల్లెలైన జి. చెరువుపల్లి, బండగానిపల్లి గ్రామాల్లో జరుగుతున్న బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమాన్ని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, ఆశసనయ్య లు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

రూ.50 వేల కోట్లతో భారీ పరిశ్రమ

జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

మాట్లాడుతున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

జిల్లాలో రామాయ పట్నం పోర్ట్ లో బిపిసిఎల్ ఆయిల్ కంపెనీ సుమారు 50 వేల కోట్లతో ఆయిల్ కంపెనీ వారు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారని ఎంపివేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విజన్ 2047 సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎక్కువగా పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా 2047 విజన్ డాక్యుమెంటరీ తయారు చేయాలని ఆయన అధికారులు సూచించారు. అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారానే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం వీలవుతుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించడానికి పారిశ్రామికవేత్త ముందుకు వస్తున్నారన్నారు.విద్యుత్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా తక్కువ రేటుకు ప్రజలకు విద్యుత్ అందించడానికి ముఖ్య మంత్రి కృషి చేస్తున్నారన్నారు ప్రజలు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతోనే విజన్ డాక్యుమెంట్ తయారుచేస్తామని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీ తయారు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుం దన్నారు. రాష్ట్రాన్ని రాబోయే 25 సంవత్స రాలలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ లో ప్రజల సూచనలు, సలహాలు తీసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరిగిదని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 50వేల మంది ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలను పొందువరిచారన్నారు..ఎంతోమంది విలువైన సూచనలు చేశారని ,విజన్ ప్రణాళిక ఇప్పటి నుండి మొదలు పెడితేనే రాబోయే 22 ఏళ్లలో లక్ష్యాలు సాధించ డానికి ఉపయోగ పడుతుందన్నారు. జిల్లాలో ప్రజలందరూ స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సూచనలు సలహాలు పొందుపరచాలని సూచించారు. జిల్లాలో స్వర్ణాంధ్ర 20 47 విజన్. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ భారతదేశం సమగ్ర అభివద్ధి సాధించి 2047 నాటికి ప్రపంచ మూడు అగ్రగామి ఆర్థిక శక్తులలో ఒకటిగా నిలవాలని ఆమె తెలియజేశారు. స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంటరీ విజన్ ను ప్రజలు భాగస్వామ్యంతో తయారు చేయాలని సూచించారు.

ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ విజన్ ప్రణాళిక ద్వారా 2047 నాటికి ఉదయగిరి నియోజక వర్గ రూపు రేఖలలో మార్పు తీసుకు వస్తామన్నారు. జిల్లాలో ఉదయగిరి ప్రాంతాన్ని,పారిశ్రామికంగా టూరిజం పరంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఉదయగిరి నియోజక వర్గంలో 325 దేవాలయాలు ఉన్నాయన్నారు. అవన్నీ కూడా శిథిలావస్థలో ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో దేవాలయాల ను అభివృద్ధి చేసి టూరిజం ప్రాంతంగా తయారు చేయడానికి విజన్ తయారు చేయాలని అధికారులు కోరారు. ఉదయగిరి నియోజక వర్గంలో పేద ప్రజలకు నాణ్యమైన విద్యను వైద్య సౌకర్యాలను అందించే విధంగా డాక్యుమెంటరీ తయారు చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మేయర్ స్రవంతి, డిఆర్‌డిఎ పీడీ సాంబశివారెడ్డితోపాటు జిల్లా అది .కారులు పాల్గొన్నారు.

ఇసుకను సరఫరా చేసేందుకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇసుకను సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టర్ వారి చాంబర్లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా ఇసుకను సిద్ధంగా ఉందన్నారు. ఆన్లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇసుకను సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. బుకింగ్స్ పెరిగే కొద్దీ ఇసుక నిల్వలు కూడా పెంచేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. త్వరలోనే ఓపెన్ రీచ్ లు కూడా అందుబాటులోకి వస్తాయని, తద్వారా మరింత ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంటుందని కలెక్టర్ చెప్పారు. ఇసుక ఆన్లైన్ బుకింగ్ విధానంలో టెక్నికల్‌గా ఇబ్బందులు లేకుండా వెంటనే పరిష్కరించేలా చూడాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఇసుకను ప్రజలకు సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, మైనింగ్ డిడి చంద్రశేఖర్, సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజు, ఆర్టీవో చందన, ఆర్‌డిఒ మలోల తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: సి పి ఎం ఆధ్వర్యంలో నిర్వహించే నెల్లూరు జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు ఎస్‌కె చాన్ బాషా తెలిపారు. గురువారం మండలంలోని దేవిస్ పేట, 7వ మైలు గ్రామాల్లో ఆటో యూనియన్ సభ్యులతో కలిసి ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విరివిగా విరాళాలు అందించి ప్రజా ఉద్యమాలకు తోడ్పడాలని తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యల పై సిపిఎం ఉద్యమాలు చేస్తూ తమ బాధ్యతగా పోరాడుతుందన్నారు. అటువంటి పార్టీకి ప్రజలు తమ వంతు సహాయం చేయాలని తెలిపారు. మండలంలోని అనేక సమస్యల పై సిపిఎం తమ గళం విప్పిందన్నారు. డిసెంబర్ 7,8 తేదీలలో జరిగే మహాసభను జయప్రధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు దయాసాగర్, మనోహర్, వెంకయ్య, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐదు మద్యం షాపులు కేటాయింపు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: నూతన మద్యం విధానాన్ని 12వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. నూతన మద్యం పాలసీ విధానంలో మండలంలో 5 షాపులు కేటాయించినట్లు నూతన బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ సిఐ జి.వి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం విలేకరులతో ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ విధానం 12వ తేదీ నుంచి అమలవుతుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీలో భాగంగా ఒకటో తేదీ నుండి లైసెన్సులు స్వీకరణ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ లైసెన్సులు ఆన్లైన్లో గాని ఆఫ్లైన్లో గాని అప్లై చేసుకోవచ్చని తెలిపారు. 9వ తేదీ సాయంత్రం నాటికి ఈ లైసెన్సులు ప్రక్రియ ముగుస్తుందన్నారు. 11వ తేదీ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా తీసి 12వ తేదీ ఎవరెవరికి షాపులు వస్తాయని ప్రకటిస్తామని తెలిపారు.ఈ పాలసీలో భాగంగా మండలానికి ఐదు షాపులు వస్తాయని తెలిపారు. ఒక్కో రిటైల్ దుకాణం కోసం రూ.2 లక్షలు డిడి రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

చిలకలమర్రిలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని బొమ్మవరం, చిలకల మర్రి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బొమ్మ వరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీ మాధవి, జిల్లా వనరుల కేంద్రం ,నెల్లూరు మాట్లాడుతూ రైతు సోదరులు తమ ఇంటి అవసరాలకు సరిపోయేంత వరకైనా ప్రకృతి వ్యవసాయం చేయాలని తద్వారా పురుగుమందులు అవశేషాలు లేని ఆహారాన్ని వాడుకోవచ్చని తెలియజేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు వారు మాట్లాడుతూ వివిధ పంటలలో కలుపు మందుల మోతాదు వాడాల్సిన సమయం తెలియజేశారు. శ్రీనివాస చక్రవర్తి, వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి మాత్రమే పల్లెల ప్రగతికి దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు శ్రీకాంత్ రెడ్డి, కాసా వెంకటసుబ్బారెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.మధ్యాహ్నం చిలకల మర్రి గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింకర్లు కావలసిన వాళు సమీప రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముప్పాళ్ల నరసింహ రాజు, సర్పంచ్, గుడిగుంట, మధులత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో పరిశీలిస్తున్న అధికారి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని వెన్నవాడ గ్రామంలో రైతు సేవా కేంద్రంలోని రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట వీధి, వెన్నవాడ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి. దేవసేనమ్మ రాబోయే రబీ సీజన్‌లో, ఎరువులు వినియోగం తగ్గించుకొని, ఖర్చులు తగ్గించుకోవాలని వాణిజ్య పద్ధతిలో వ్యవసాయ సాగు చేసినప్పుడే సాగు గిట్టుబాటు అవుతుందని. తెలియజేశారు. రబీ సీజన్‌కు అనువైన వరి రకాలు యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, ప్రస్తుత వ్యవసాయ శాఖ ద్వారా అందజేస్తున్న రాయితీ విత్తనాలు, ఈ - పంట నమోదు సిసిఆర్సి కార్డులు పీఎం కిసాన్ స్కీముల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు,వెన్నవాడ గ్రామ రైతులు ఎంపీఈఓ రేణుక, విఎఎ లు దీప వెన్నవాడ గ్రామ సర్పంచ్ జగన్నాథం లక్ష్మమ్మ , ఎంపీటీసీ ప్రమీల. పలువురు పాల్గొన్నారు.

ఆత్మకూరులో మాట్లాడుతున్న దేవసేనమ్మ

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కలిగిరి: కాపు టీచర్స్ వెల్ఫేర్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. రాష్ట్ర ఉపాధ్య క్షుడు కమతం సుబ్బారావు అధ్యక్షతన ముఖ్య అతిథి ఎంఇఒ తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కింద కమిటీని ఎన్ను కున్నారు. గౌరవ అధ్యక్షులు. గుండా రవిబాబు, అధ్యక్షులు శిగే కొండయ్య, ప్రధాన కార్యదర్శి గాండ్ల బాలవెంగయ్య, ఆర్థిక కార్యదర్శి నున్నా దామోదర్, తదితరులను ఎన్నుకున్నారు.

కార్యదర్శి కరిముల్లా

ఉదయగిరిలో గ్రామసభ

ప్రజాశక్తి-ఉదయగిరి: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం 15వ ఆర్థిక సంఘం నిధులు వ్యయం పై సర్పంచ్ పాములూరి సామ్రా జ్యం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి గాను విడుదలైన నిధులు విడుదల కాబోతున్న నిధులు ఖర్చు చేసేందుకు అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లా తెలిపారు. కార్యక్రమ లో ఉప సర్పంచ్ ముత్తుజా హుస్సేన్, ఎంపీటీసీ పెద్దమస్తాని, ఎజ్దానీ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎజ్దానీ పాల్గొన్నారు.

దసరా సెలవులు కచ్చితంగా పాటించాలి

ప్రజాశక్తి-కావలి: ఈనెల3 నుంచి13వ తేదీ వరకు దసరా సెలవులు కచ్చితంగా పాటించాలని, సెలవల రోజుల్లో స్పెషల్ క్లాస్ తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని టి ఎన్ ఎస్‌ఎఫ్ నాయకులు దార్ల శివకుమార్ హెచ్చరిం చారు. స్కూల్ మా యాజ మా న్యాలు తమకు సహకరించాలని అయన విజ్ఞప్తి చేశారు.

మత్తు పదార్థాలపై ఉక్కు పాదం

ప్రజాశక్తి-ఉదయగిరి: ఉదయగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలాల్లో ఎవరైనా అక్రమ మద్యం తరలింపు మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపుతున్నట్లు సిఐ తన్నీరు లక్ష్మణ్ స్వామి పేర్కొన్నారు. గురువారం ఆయన ఉదయగిరి ఎక్సైజ్ సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ విధానంలో దరఖాస్తులు ఈ నెల 9 తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అక్రమ మద్యం తరలింపు మట్టి ఇసుక తరలింపు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.వీటిపై సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశమన్నారు.

31 అజెండాలకు ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం అత్యవసర కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పంచా యతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మాట్లా డుతూ అత్యవసర కౌన్సిలర్ల సమావేశంలో పలు సమ స్యలకు 31 అజెండాలను ప్రవేశ పెట్టడం జరిగింది. కౌన్సిలర్లు అన్ని అజెండాలను ఏకగ్రీవ ంగా ఆమోదించినందుకు వారికి అభినం దనలు తెలియజేశారు. అనంతరం కోవూరు శాసనసభ్యురాలు మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన అజెండాలను కౌన్సిలర్లు అందరూ అంగీకరించి నందుకు సంతోషకరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ ంలో శాఖల వారీగా జరిగిన అవినీతిని పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ ప్రస్తుతం జరగబోయే అభివృద్ధికి సహకరించా లన్నారు. అన్ని వార్డులలోని కౌన్సిలర్లు పార్టీలకు అతీ తంగా కలిసికట్టుగా ఉండి సమస్యల కోసం తనను సంప్రదిస్తే నిత్యం వారికి అందుబాటులో ఉంటానన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా సమపాలనలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ఉపాధి పనులపై గ్రామసభలు

ప్రజాశక్తి-ఉదయగిరి: మండలంలోని 17 పంచాయతీల్లో అక్టోబర్ 2 నుండి 11 వరకు ఇనిషియల్ గ్రామసభలు, అక్టోబర్ 15 నుండి నవంబర్ 25 వరకు ఫైనల్ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శ్రీనివాసులు తెలిపారు. 2025 -26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో హార్టికల్చర్ సెరికల్చర్ డ్రాగన్ ఫ్రూట్ సాగు, కందకాలు పలు రకాల 78 రకాల పనులను గుర్తించి ఉపాధి పథకం ద్వారా పనులు చేపడతామన్నారు. చేయాల్సిన పనులపై గ్రామ సభలు గుర్తించి పనులను చేపడతామన్నారు.

పిహెచ్‌డి గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల పిహెచ్‌డి అవార్డు అయిన వారిని సన్మానించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఇఇఇ వాసుపల్లి రవీంద్రారెడ్డి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుంచి పిహెచ్.డి అవార్డును పొందారు. హెచ్ అండ్ ఎస్ డిపార్ట్మెంట్ హెచ్ ఒడిగా పనిచేస్తున్న కె.లక్ష్మికి జేఎన్టీయూ అనంతపురం యూనివర్సిటీలో పీహెచ్. డి పొందారని తెలిపారు. సివిల్ డిపార్ట్మెంట్లో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న సత్యనారాయణ రెడ్డి ఎన్ఐటి కాలి కట్ నుండి, కె.జగదీష్ క్రిసెంట్ యూనివర్సిటీ చెన్నయ్ వారిచే పొందినట్లు తెలిపారు. వీరిని కళాశాల యాజమాన్యం తరఫున గురువారం సాయంత్రం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్ వి.రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వి.సునీల్ రెడ్డి అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారని తెలిపారు.

కారు బోల్తా ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వింజమూరు: పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు దగ్గర్లో కావలి నుండి కడపకు వెళ్తున్న కారు తిరగబడి అందులో ఒకరు మృతి చెందారు. మరొకిరికి తీవ్రగాయాలయ్యాయి. పూర్తి వివరాల్లోకెళ్తే గురువారం సాయంత్రం కావలి నుంచి కడప కి వెళ్తున్న కారు వింజమూరు దగ్గరలోనే బొమ్మరా చెరువు వద్దకు రాగా కుక్క అడ్డు వచ్చింది. దాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న కంకర గుట్ట మీదకి కారు ఎక్కి తిరగబడింది. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ పక్కలో ఉన్న వ్యక్తికి తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలశాఖఅధికారిని కలిసిన మాల్యాద్రి

ప్రజాశక్తి-కావలి: నెల్లూరులో జిల్లా క్రీడల శాఖ అధికారులతో గురువారం నెల్లూరు జిల్లా పారా క్రీడల కమిటీ అధ్యక్షులు టిసి మాల్యాద్రి నాయుడు, జిల్లా కార్యదర్శి కటారి యాదగిరిలతో కలిసి సమావేశమయ్యారు. జిల్లాలో వికలాంగుల క్రీడల గురించి, వారికి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు గురించి క్రీడ శాఖ అధికారి విజయ్ కుమార్ తో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో కలిసి చర్చించారు.

బదిలీ అధికారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-మర్రిపాడు: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ సురేంద్ర మరో నలుగురు రెవెన్యూసిబ్బంది బదిలీ అయ్యారు. వారిని తహశీల్దార్ స్వప్న, సిబ్బంది శాలువాలు పూల మాలలు కప్పి ఘనంగా సన్మానించారు. మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించారని తహశీల్దార్ కొనియాడారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్: ఆత్మకూరులో శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శివాలయంలో బాలత్రిపుర సుందరి అలంకారంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. కాశీనానాయన ఆశ్రమంలో లలితాదేవి అలంకారంలో గాయత్రిదేవి భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయాల్లో వేద పండితులు వేద మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అంద చేశారు. వాసవి కన్యకా పర మేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంబమయ్యాయి. గురువారం కలిశస్థాపనతో కార్యక్రమాలను ప్రారంభించారు.తొలి రోజు భువనేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలం సోమశిల గ్రామంలోని సోమేశ్వర ఆలయంలో గురువారం నుంచి శ్రీ కామాక్షి సమేత శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొదటి రోజున శ్రీ కామాక్షి సమేత అమ్మవారు భక్తులకు త్రిపుర సుందరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈనెల 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

In The Court of The 1st Addl. Senior Civil Judge : Nellore
I.P.No. 48 / 2024

Kondakavuru Aparna - Petitoner
Vs
1. Madabhushi Godavarthi Lakshmi
2. The Manager State Bank of India, Achari Street, Nellore.
3. The Branch Manager, ICICI Bank, Dandayudhapuram, Nellore City.
4. The Manager, Flipkart Axis Bank, Subedarpet, Nellore City.
5. The Manager, Mobikwik, Gurugram Haryana-122003.
6. The Manager, IDFC Bank, Srinivasa Agraharam, Mini Bypass Road, Nellore City. - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరు తనని ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై వారి కోర్టులో **I.P. No.48/2024** పిటిషన్ దాఖలు చేసియున్నందున సదరు పిటిషన్‌లో ఎవ్వరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్నయెడల **తే10-12-2024** దిన వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది.

పి.సి.కృష్ణయ్య, బి.ఎ., బి.ఎల్.,
పిటిషనరు తరపు అడ్వకేట్, నెల్లూరు.

కావలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం.108/2015

బిట్వీన్ :
1. **బొగ్గవరపు శ్రీనివాసరావు**
2. **ఓలేటి వెంకట మస్తాన్ బాబు** - వాదులు
వర్సెస్
1) **చవల గోపి కృష్ణ,**
2) **మేనేజర్, కార్పొరేషన్ బ్యాంక్** (యూనియన్ బ్యాంక్), కావలి
3) **డి.వి.సత్యనారాయణ**
4) **పొట్లూరు ప్రభాకరయ్య** - ప్రతివాదులు

4వ ప్రతివాదికి దావా నోటీసు

ఆర్4) **పొట్లూరు ప్రభాకరయ్య,**తండ్రి **లేట్ రామయ్య,** ఇంటి నెం.6-8-66, జెండా వీధి, కావలి, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, అనువారికి,

ఈ నెంబరున వాదులు పై నెంబరు దావా దాఖలు చేయగా, సదరు దావాలో 4వ ప్రతివాది అగు మీకు, నోటీసు నిమిత్తం **తే15-10-2024**ది.నకు శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా తెలపమని వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆదినం **ఉదయం 10.30 గం॥లకు** శ్రీకోర్టు వారి ఎదుట హాజరై, మీకు గల ఆక్షేపణలు తెలుపు కొన వలసి ఉన్నది. హాజరు కాని యెడల, మీపరోక్షమందు ఎక్స్ పార్టీ డిక్రీగాతీర్మానించబడును.

// కోర్టు ఉత్తర్వుల మేరకు //
ఇట్లు,
శీలం గోపయ్య,
వాదుల తరుపు న్యాయవాది, కావలి.